
ప్రజాశక్తి
మంగళవారం 10 డిసెంబర్ 2024 5 అనంతపురం





అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్




చిరువ్యాపారులపై.. విద్యుత్ బాదుడు..!

రాష్ట్ర ప్రభుత్వం చిరువ్యాపారులపైనా విద్యుత్ బాదుడు మోపింది. అసలే వాణిజ్య విద్యుత్ ఛార్జీల భారం అధికమని ఇబ్బందులు పడుతున్న వారిపై సర్దుబాటు, ట్రూఅప్‌ల భారాలను వేసింది. గత నెలలోనే ఒక సర్దుబాటు, ట్రూప్ ఛార్జీల భారాన్ని వేయగా, డిసెంబరులో మరో సర్దుబాటు ఛార్జీని వేసింది. ఒక్కో వినియోగదారుడిపై రూ.500కుపైగానే భారం వేసింది. ఈ బాదుడు చూసి వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

- సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీల మోత
- గత నెలతో పోలిస్తే అధికంగా బిల్లులు
- ప్రభుత్వ తీరుపై చిరువ్యాపారుల అసహనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



గృహాలపైనే కాకుండా వాణిజ్య సర్వీసులపైనా అదనపు భారాలు వేయడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. కోవిడ్ సమయం నుంచి వ్యాపారాలు దెబ్బతిని ఉన్నాయి. ఇవి చాలావన్నట్టు అదనంగా విద్యుత్ భారాలు వేయడం పట్ల చిరువ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి భారాలను తగ్గించాలని కోరుతున్నారు.

రూ.682 అదనం

అనంతపురం నగరంలోని పాతూరులో పిండిమిషన్ నిర్వహించుకుంటున్న వ్యాపారి బిల్లు చూస్తే ఈ ఒక్క నెలలోనే అదనపు భారం రూ.682 పడింది. నగరంలోని సర్వీసు నంబరు 7112101019932 ఉంది. పరిశ్రమల కనెక్షన్ కింద ఈ సర్వీసు ఉంది. 498 యూనిట్లు నెల రోజుల వ్యవధిలో వినియోగించారు. దీనికి సంబంధించి ఎలక్ట్రికల్ ఛార్జీలు రూ.3651 అయింది. దీనికి అదనంగా ఫిక్స్‌డ్ ఛార్జీల పేరుతో రూ.825, కస్టమర్ ఛార్జీ పేరుతో రూ.63, ఎలక్ట్రికల్ డ్యూటీ రూ.498 వేశారు. ఇవి కాకుండా ఎఫ్‌పిపిసిఎ 2022–24కు సంబంధించి రూ.239.31, ఎఫ్‌పిపిసిఎ 2024–10 కింద రూ.254, ట్రూఅప్ ఛార్జీ రూ.188.44 , సర్‌ఛార్జీ రూ.150 ఇలా అన్ని రకాల ఛార్జీలు కలిపి రూ.5872 బిల్లు వచ్చింది. ఇందులో సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీలదే రూ.682 ఉంది. అసలు బిల్లుతో పోలిస్తే అదనంగా కట్టాల్సింది రూ.2221 ఉంది. రోజురోజుకూ ఈ రకంగా భారాలు వేస్తూపోవడం ఇబ్బందికరంగా ఉందని వినియోగదారుడు మోహమ్మద్ అలీ ఆవేదన వ్యక్తం చేశాడు .

గత నెల 412... ఇప్పుడు రూ.712..!

రినాస్, టీ కొట్టు నిర్వాహకుడు

గత నెలలో రూ.412 విద్యుత్ ఛార్జీ రాగా, ఈనెల రూ.712 బిల్లు వచ్చిందని అనంతపురం నగరంలో టీ కొట్టు నిర్వాహకుడు రినాస్ తెలిపాడు. రూ.108కుపైగా ఇంధన సర్దుబాటు రూపంలో వేశారని, ఇప్పటికే గ్యాస్, పంచదార, టీపొడి ధరలు పెరిగాయని, వీటికి తోడు విద్యుత్ బారాలు పెరగడం అదనపు భారమవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. దాదాపు రూ.300లకుపైగా ఈ ఒక్క నెలలోనే అదనపు బిల్లు వచ్చిందని ఆయన తెలిపాడు.

అర్జీల పరిష్కారానికి నిరంతర పరిశీలన

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వివిధ సమస్యలపై ప్రజలు అందించే అర్జీల పరిష్కారంపై నిరంతర పరిశీలన ఉండి వాటికి సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ తిప్పేనాయక్, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ,తో కలిసి 485 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను గడువులోగా తక్షణమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పిజిఆర్‌ఎస్ అర్జీలపై నిత్యం మానిటర్ చేస్తూ నాణ్యతగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పాస్ బుక్ సర్వీసెస్‌లో నందు ఆత్మకూరు వెనుకబడి ఉందని, దానిని వెంటనే పూర్తి చేయాలని తహసీల్దార్ ను ఆదేశించారు. కలెక్టర్ల సమావేశం ఉన్నందున ఫ్రీ హెూల్డ్ వెరిఫికేషన్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో ప్రతిరోజూ మూడు నుంచి నాలుగు గంటల వరకు విజిటింగ్ అవర్స్ ఉండేలా చూసుకోవాలన్నారు. పీపుల్ ఫ్రెండ్లీ గవర్నమెంట్‌లా అధికారులు వ్యవహరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఒ అశోక్ కుమార్, జడ్పీ సిఈఓ వెంకటసుబ్బయ్యతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సాయుధ దళాల పతాక నిధికి


ఉదారంగా విరాళాలు ఇద్దాం



విరాళం అందిస్తున్న ఎస్పీ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాలు, సరిహద్దుల్లో అహర్నిశలు విధులను నిర్వర్తిస్తున్న సైనికులు, మాజీ సైనికుల సంక్షేమం కోసం సాయుధ దళాల పతాక నిధికి అన్ని వర్గాల ప్రజలు ఉదారంగా అందించి ఉమ్మడి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని అనంతపురము కలెక్టర్ డా॥వినోద్ కుమార్, శ్రీసత్య సాయి కలెక్టర్ టి.ఎస్.చేతన్ పిలుపునిచ్చారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సాయుధ దళాల పతాక నిధికి ఉమ్మడి జిల్లాలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని సోమవారం కొనసాగించారు. అనంతపురము కలెక్టర్ కార్యాలయం రెవెన్యూ భవన్లో కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్, పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ టిఎస్.చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌ల జిల్లా సైనిక సంక్షేమ శాఖ సిబ్బంది విరాళాలను సేకరించారు. అనంతపురంలో జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి పి.తిమ్మప్ప పాల్గొన్నారు. సైనికుల సంక్షేమానికి ప్రజలు విరివిగా విరాళాలు అందించాలని ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ప్రజలకు పిలుపునిచ్చారు.



గండిపడిన హెచ్‌ఎల్సీ కాలువ ప్రాంతం

హెచ్‌ఎల్సీ కాలువకు గండి

చెరువులకు వెళ్లే నీరంతా వృథా

ప్రజాశక్తి-పుట్లూరు


మండల పరిధిలోని సుబ్బరాయసాగర్ నుంచి పుట్లూరు చెరువుకు వచ్చే హెచ్‌ఎల్సీ కాలవకు చింతకుంట, పుట్లూరు గ్రామ సమీపంలోని 15 కిలోమీటర్ వంక వద్ద సోమవారం సాయంత్రం గండిపడింది. దీంతో నీరంతా వృథాగా బయటకు వెళ్లింది. పుట్లూరు, కోమటికుంట్ల గరుగుచింతలపల్లి రైతులు గత నవంబర్ నెల నుంచి కాలువలపై తిరుగుతూ నీటి సంరక్షణ చర్యలు చేపట్టారు. రోజుకు 20 వేల రూపాయలు ఖర్చు చేసుకుని పుట్లూరు చెరువును నీటితో నింపేందుకు కష్టపడుతున్నారు. ఇలాంటి సమయంలో చెరువుకు చేరుతుందనుకున్న నీరు వృథాగా పోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నెల రోజులు కష్టపడి తెచ్చుకున్న నీరంతా వంకపాలు కావడంతో నిరాశ చెందారు. పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులు నిండితే తాగునీటి సమస్య తీరుతుందని భావించిన రైతులకు నిరాశే మిగిలింది. గండిపడి నీరంతా బయటకు వెళ్తుండడంతో చెరువులు, నిండుతాయా లేదా అన్న సందేహం నెలకొంది.



వృథాగా బయటకు వెళ్తున్న నీరు

ఎమ్మెల్యే, జెఈ పరిశీలన

గండిపడిన హెచ్‌ఎల్సీ కాలవ ప్రాంతాన్ని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, జెఈ శ్రీనివాసులు పరిశీలించారు. సోమవారం రాత్రి వారు గండిపడిన ప్రాం తాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. గండిని యుద్ధ ప్రాతిపదికన పూడ్చి చెరువు లకు నీరందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. వెంటనే మర మ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

రైల్వే సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లాలో రైల్వే సమస్యలపై రైల్వే మినిస్టర్ ఆఫ్ స్టేట్ వీరన్న సోమన్నను ఎంపి అంబికా లక్ష్మీనారాయణ సోమవారం నాడు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతపురం, రాయదుర్గం, గుత్తి, హిందూపురం పట్టణాలకు సంబంధించి రైల్వే సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాజధాని ఎక్స్‌ప్రెస్, యశ్వంతపూర్ – బీదర్ ఎక్స్‌ప్రెస్, యశ్వంతపూర్ – లాతూర్ ఎక్స్‌ప్రెస్ అనంతపురం నందు నిలపాలని కోరారు. టాటా నగర్ – యశ్వంత్పూర్ ఎక్స్‌ప్రెస్, మైసూర్ –వారణాసి ఎక్స్‌ప్రెస్, యశ్వంతపూర్– జైపూర్, తిరుపతి–దోడహల్లి ఎక్స్‌ప్రెస్‌ను రాయదుర్గంలో నిలపాలని కోరారు. సంపత్ క్రాంతి ఎక్స్‌ప్రెస్, కంగు ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రాయల్ చెరువులో నిలవాలని కోరారు. వందే భారత్, రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను హిందూపురంలో నిలిపాలని విజ్ఞప్తి చేశారు. గుంతకల్లు, అనంతపురం నగరాల్లో అండర్‌పాస్‌లను నిర్మించాలన్నారు. కొండవీడు ఎక్స్‌ప్రెస్ – ధర్మవరం నుంచి యశ్వంతపూర్ వరకు, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్– ధర్మవరం నుంచి హిందూపూర్ వరకు, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ – ధర్మవరం నుంచి అనంతపురం వరకు, హౌరా ఎక్స్‌ప్రెస్ – గుత్తి నుంచి గుంతకల్ వరకు కొనసాగించాలని కోరారు. మైసూర్ నుంచి జైపూర్ ఎక్స్‌ప్రెస్ వారానికి రెండు, మూడు రోజులు నడవాలన్నారు. యశ్వంత్పూర్, జైపూర్ ఎక్స్‌ప్రెస్‌ను వారానికి మూడు రోజులు నడపాలని కోరారు. తిరుపతి–కదిరి దేవరపల్లి రైలును ప్రారంభించాలన్నారు. గుంతకల్–చిక్ జార్జూర్ రోజూ నడపాలని కోరారు. రైల్వే స్టేషన్లలో లిఫ్ట్, మరుగుదొడ్లు, తాగునీరు తదితర ప్రయాణికుల సమస్యల పరిష్కారంపైనా ఎంపీ వినతిపత్రం అందించి పరిష్కరించాలని కోరారు.



రైల్వే మినిస్టర్ ఆఫ్ స్టేట్ వీరన్న సోమన్నకు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ అంబికా

14,15న మానవ హక్కుల వేదిక రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మానవ హక్కుల వేదిక ఆంధ్ర, తెలంగాణ ఉభయ రాష్ట్రాల ద్వైవార్షిక మహాసభలు ఈనెల 14 ,15వ తేదీల్లో అనంతపురంలో జరగనున్నాయి. సాయినగర్ ఆపిల్ ఫంక్షన్ హాల్‌లో రెండు రోజుల పాటు ఇవి జరగనున్నాయి. మహాసభలకు సంబంధించిన పోస్టర్లను సోమవారం నాడు అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక నాయకులు అడ్వకేట్ ఎస్.అబ్దుల్‌రసూల్, ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం గత 25 సంవత్సరాలుగా వివిధ వర్గాల ప్రజల పోరాటాల్లో భాగమై మానవ హక్కుల వేదిక పనిచేస్తోందన్నారు. అనంతపురం జిల్లా కరువు, సాగునీరు, అభివృద్ధి సమస్యలపై విస్తృతంగా పనిచేసిందని తెలియజేశారు. మహాసభల్లో భాగంగా రెండవ రోజు 15వ తేదీ సదస్సు జరుగుతుందని తెలిపారు. కులగణన, విద్యా కాషాయీకరణ, బస్తర్‌లో హింసకాండ తదితర అంశాలపై ఉపన్యాసాలు ఉంటాయని చెప్పారు. మాజీ రాష్ట్రపతి కెఆర్.నారాయణన్ వద్ద ఓఎస్‌డిగా పనిచేసిన మాజీ ఉన్నతాధికారి ఎస్ఎన్.సాహూ, స్వతంత్ర జర్నలిస్టు మాలిని సుబ్రహ్మణ్యం, చారిత్రకాంశాల రచయిత కొప్పర్తి వెంకటరమణమూర్తి ప్రసంగిస్తారని వారన్నారు. ఈ సదస్సులో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా, బిఎన్.సుబ్బన్న, ఆహ్వాన సంఘం ప్రతినిధి ఎస్.దాదాగాంధీ పాల్గొన్నారు.

సిపిఎం నగర కార్యదర్శిగా వి.రామిరెడ్డి



ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిపిఎం నగర కార్యదర్శిగా వి.రామిరెడ్డి ఎన్నికయ్యారు. నగరంలోని గణేనాయక్ భవన్‌లో నగర మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శితోపాటు కార్యదర్శివర్గ సభ్యులుగా ఆర్.వి.నాయుడు, వెంకటనారాయణ, గోపాల్, ముర్తుజా, వలి, ప్రకాష్, మసూద్, ఇర్ఫాన్, నగర కమిటీ సభ్యులుగా ఓబులేసు, లక్ష్మీనరసమ్మ, ఎటిఎం నాగరాజ్, వెంకటేష్, ఎన్టీఆర్ శ్రీను, ప్రసాద్, జీవా, ఇర్ఫాన్, బుల్లే రాజు, రామాంజినమ్మ, బాలకృష్ణ, బాబా, ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, గఫూర్, ఆదినారాయణ, వెంకటనారాయణ, లతీఫ్ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై తీర్మానాలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత నాయకులు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ముఖ్యంగా నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేస్తామని, మరువవంక, నడిమివంక సైడ్‌వాల్ నిర్మిస్తామని, రింగ్ రోడ్డు తీసుకొస్తామని, ఇల్లు, స్థలాలు ఇస్తామని చెప్పి, అమలు చేయడంలో పట్టించుకోలేదన్నారు. వీటితోపాటు అనేక సమస్యలపై పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

వామపక్షాల ఆధ్వర్యంలో వినతి

ప్రజాశక్తి-పామిడి



ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ అధికారి మధుసూదన్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలపై రూ.15,485కోట్ల విద్యుత్ భారాన్ని మోపిందన్నారు. సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్‌ఛార్జీలను భారీగా పెంచి ప్రజలపై పెనుభారం మోపుతున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి నాయకులు విద్యుత్ ఛార్జీలపై అనేకసార్లు ఉద్యమాలు చేశారన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే విద్యుత్ ఛార్జీలు పెంచిందన్నారు. వెంటనే ప్రభుత్వం పెంచిన ఛార్జీలను ఉపసంహరించుకోవాలన్నారు. లేనిపక్షంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, కులసంఘాలు కలుపుకుని దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు అనిమిరెడ్డి, రహీం, దస్తగిరి, మల్లేష్, చౌడప్ప, రాముడు, బాబా ఫక్రుద్దీన్, సునీల్ కుమార్, వీరేంద్ర స్వామి, తదితరులు పాల్గొన్నారు.

వరికి గిట్టుబాటు ధర కల్పించాలి


ప్రజాశక్తి-బొమ్మనహాల్

వరి ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని సిఐటియు నాయకులు ఓబులేసు, పెన్నయ్య సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలోని తుంగభద్ర ఆయకట్టు కింద సాగు చేసిన వరి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.3వేలు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. లేకుంటే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఎందుకంటే రైతులు ఎకరాలో వరిపంట సాగు చేయాలంటే దాదాపు రూ.40వేలు పెట్టుబడి పెట్టాల్సి వస్తోందన్నారు. ఈనేపథ్యంలో అతివృష్టి, అనావృష్టి కారణంగా ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడి కూడా రాని పరిస్థితి నెలకొందన్నారు. కావున ప్రభుత్వం స్పందించి కనీసం క్వింటాకు రూ.3వేలు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని డిమాండ్‌చేశారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆసుపత్రిలో టిడిపి నాయకులు పసుపుల బ్రదర్స్ సహకారంతో ప్రతినెలా 9వతేదీన గర్భిణులకు అందించే భోజన వసతిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత, నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి, పసుపుల హనుమంతురెడ్డి, తహశీల్దార్ పుణ్యవతి, ఎంపిడిఒ సొలమన్‌రాజ్, డాక్టర్ స్వాతిలక్ష్మి, హౌసింగ్ ఎడి రామ్మూర్తి, మాజీ సర్పంచి లక్ష్మీనారాయణ, కేసన్న, పొడరాళ్ల రవీంద్ర, ఓబుళపతి, జొన్న రామయ్య, పసలూరు రామకృష్ణారెడ్డి, బుల్లే నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు చేయాలి

వామపక్షాల ఆధ్వర్యంలో మొక్కలు నాటి నిరసన

ప్రజాశక్తి-గుత్తి




మొక్కలు నాటి నిరసన తెలుపుతున్న నాయకులు

పట్టణంలోని గుంతకల్లుకు వెళ్లే రహదారికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం వినూత్నంగా నిరసన తెలిపారు. ఇందులో భాగంగా గుంతల్లో నిల్వ ఉన్న నీటిలో వరినాట్లు నాటుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకుడు యు.మల్లికార్జున, సిపిఐ మండల కార్యదర్శి జి.రామదాసు, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు అంజనప్రసాద్ మాట్లాడుతూ గుంతకల్లు రోడ్డులో మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడటం వల్ల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఇటీవల ద్విచక్ర వాహనంలో వస్తూ పూలకుంటకు చెందిన రైతు మృతి చెందాడని చెప్పారు. రోడ్డు ప్రమాదాలకు గురై పలువురు గాయపడ్డారని గుర్తు చేశారు. తారు రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకుడు ఎం.మల్లేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి రాజుయాదవ్, నాయకులు వన్నూరుసాబ్, ఓబులేసు, ఎంఆర్‌పిఎస్ నాయకుడు అడవి రాముడు, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసులు పెంచాలి

ఆర్టీటీ ఎమ్‌డికి విప్ కాలవ వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం



డిజిపికి వినతిపత్రం అందజేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

కర్ణాటక సరిహద్దులో ఉన్న రాయదుర్గం నియోజకవర్గం నుంచి ఆర్టీసీ సర్వీసుల సంఖ్య పెంచాలని విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. ఈమేరకు సోమవారం సాయంత్రం విజయవాడ నగరంలోని డిజిపి క్యాంపు కార్యాలయంలో ఆర్టీసీ ఎండి, డిజిపి తిరుమలరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ కర్ణాటక–ఆంధ్ర అంతరాష్ట్ర సర్వీసుల విషయంలో ఇరురాష్ట్రాల మధ్య కుదరాల్సిన ఒప్పందంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. దీన్ని సత్వరం పూర్తి చేయాలని కోరారు. రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం పూర్తయితే చాలా బస్సు సర్వీసులు కర్ణాటక, ఆంధ్రాల మధ్య తిరిగి ప్రారంభయ్యే అవకాశాలు ఉంటాయని ఎం.డికి వివరించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ ఇందిరా ప్రియదర్శిణి సూచించారు. ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని కొర్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా గర్భిణులకు రక్త పరీక్ష, బిపి, ఎత్తు, బరువు వంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ రక్తహీనతలో ఉన్న గర్భిణులకు ఐరన్ సుక్రోజ్ ఎక్కించడం, అవసరమైన వారికి ఉచితంగా స్కానింగ్ చేయించనున్నట్లు తెలిపారు. ప్రతినెలా ఆరోగ్య కేంద్రానికి వచ్చే గర్భిణులకు మాజీ సర్పంచి భీమిరెడ్డి గారి బాలనాగిరెడ్డి ఉచిత భోజనం వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్యా బోధకురాలు పర్వీన్, సిహెచ్ఒ టి.మోహన్‌బాబు, సూపర్‌వైజర్ శ్రీదేవి, స్టాఫ్‌నర్సు శ్యామల, ఫార్మాసిస్ట్ శ్రీధర్, ఎల్‌టి.కరుణాకర్, వెంకటేష్, రాజేంద్ర పాల్గొన్నారు.



బుక్కరాయసముద్రం మండలంలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

యాడికి : ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన గర్భిణులకు రాయలచెరువు సివి.రమణారెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పరమేష్, సిహెచ్ఒ జుబేదా, పిహెచ్ఎన్ వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఉపాధి' పాత ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలి

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన ఉపాధి హామీ పాత ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించి కొత్త వారిని నియమించాలని గ్రామస్తులు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయానికి చేరుకుని ఎంపిడిఒ శ్రీకాంత్‌చౌదరితో వాగ్వివాదానికి దిగారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో పని చేసిన క్షేత్ర సహాయకుడు సక్రమంగా పనులు కల్పించడం లేదన్నారు. దీంతో కొత్త ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించారన్నారు. ఈనేపథ్యంలో కొత్తగా నియమించిన ఫీల్డ్ అసిస్టెంట్ ఐదు నెలలుగా ఉపాధి హామీ పనులు కల్పిస్తున్నా అతనికి వేతనాలు ఇవ్వకపోవడంతో తమకు పనులు కల్పించలేదన్నారు. పని చేసే వారికి కాకుండా పని చేయని వారికి ఏ విధంగా వేతనాలు ఇస్తారని నిలదీశారు. ఇందుకు స్పందించిన ఎంపిడిఒ గతంలో పని చేసిన ఫీల్డ్ అసిస్టెంట్ మూడు నెలలుగా విధుల్లోకి రావడం లేదన్నారు. అప్పటి నుంచి ఎలాంటి వేతనం ఇవ్వడం లేదన్నారు. ప్రస్తుతం మీరు ఏర్పాటు చేసుకున్న ఫీల్డ్ అసిస్టెంట్‌కు పనులు అప్పగించామని, త్వరలో అతనికి వేతనం పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఎంపిడిఒతో మాట్లాడుతున్న తిమ్మాపురం గ్రామస్తులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

తహశీల్దార్ ఎస్.బ్రహ్మయ్య, ఎస్ఐ శరత్‌చంద్ర

ప్రజాశక్తి-శింగనమల

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎస్.బ్రహ్మయ్య, ఎస్ఐ శరత్‌చంద్ర సూచించారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లో వేర్వేరుగా జై భీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా గిరిజన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'సైబర్ నేరాలతో తస్మాత్ జాగ్రత్త' అనే గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. కావున ప్రజలు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జై భీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా యూత్ ప్రెసిడెంట్ రామావత్ చందునాయక్, గుంతకల్లు నియోజకవర్గ గిరిజన యువ నాయకుడు సభావత్ గోవింద్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న తహశీల్దార్ ఎస్.బ్రహ్మయ్య

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

ఎఎస్‌డబ్ల్యుఒ బి.రాధిక

ప్రజాశక్తి-గుత్తి

పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని సాంఘిక సంక్షేమ సహాయ అధికారిణి బి.రాధిక సూచించారు. సోమవారం పట్టణంలోని ఎఎస్‌డబ్ల్యుఒ కార్యాలయంలో సోమవారం డివిజన్ పరిధిలోని హెచ్‌డబ్ల్యుఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు హెచ్‌డబ్ల్యుఒలు నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. వసతి గృహాల్లో కనీస సదుపాయాలు కల్పించాలన్నారు. వంటగదిని శుభ్రంగా ఉంచుకుని నాణ్యమైన భోజనం అందించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను కార్మికులు శుభ్ర పరిచేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఎస్.రాధాకృష్ణారెడ్డి, వసతి గృహ సంక్షేమాధికారులు (హెచ్‌డబ్ల్యుఒ) ఆదినారాయణ, సంజీవరాయుడు, జగన్నాథ్, ఉమాదేవి, జ్యోతి, జ్ఞానమ్మ, ఈశ్వరమ్మ,నాగరాజు, మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎఎస్‌డబ్ల్యుఒ బి.రాధిక

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు భీమక్క, రామప్ప జ్ఞాపకార్థం వారి కుమారులు డాక్టర్ కెజె సిద్దేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో నగదు బహుమతులు, బంగారు పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కురుగోడు వీరేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇంటర్‌లోని ప్రతి గ్రూపులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.5వేల చొప్పున బహుమతి, నాలుగు గ్రూపులలో మెరిట్ వచ్చిన వారికి భీమా గ్రూప్ ఆఫ్ మెరిట్ అవార్డ్స్ వారు ప్రతి ఏడాది బంగారు పతకం, నగదు బహుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు ఎస్.మమత, రాయదుర్గం బాలికల జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు బి.విజయభాస్కర్, విశ్రాంత భౌతికశాస్త్ర అధ్యాపకులు వై.కృష్ణమాచారి, అనంతపురం కెఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాల భౌతిక శాస్త్రం అధ్యాపకులు వి.రంగరాజు, నార్పల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతిక శాస్త్రం అధ్యాపకులు జింకా లక్ష్మీరంగయ్య పాల్గొన్నారు.



ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న అతిథులు

డ్రైవర్ రాఘవ మిస్సింగ్‌పై ఉత్కంఠ

ప్రజాశక్తి-నార్పల

గత శనివారం రాత్రి అదృశ్యమైన రాఘవ అనంతపురంలో పోలీసుల సమక్షంలో ఉన్నాడంటూ నార్పలలో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్‌ను వివరణ కోరగా తమకు అలాంటి స్పష్టమైన సమాచారం లేదన్నారు. అయితే రాఘవ కోసం పలు కోణాల్లో గాలిస్తున్నట్లు తెలిపారు. కాగా రాఘవ ఇంటి వెళ్లిపోయేటప్పుడు డైరీలో ఏదో రాసి పోయాడని, కాల్ రికార్డింగ్‌లు ఉన్నాయనినే విషయాలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఏదేమైనా డ్రైవర్ రాఘవ క్షేమంగా తిరిగి రావాలని తల్లి, భార్య, పిల్లలు కోరుతున్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

బెలుగుప్ప : గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహశీల్దార్ షర్మిల తెలిపారు. సోమవారం మండల పరిధిలోని రామసాగరం గ్రామంలో భూ సమస్యలపై పలువురు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రామకృష్ణమ్మ, ఎంపిడిఒ టి.లక్ష్మీనారాయణ, ఆర్ఐ రమాదేవి, సర్వేయర్ నీలకంఠ, నాయకులు ఎర్రగౌడ్, టిఆర్ఎస్ స్వామి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు

ప్రత్యేక విద్యుత్ అదాలత్

అనంతపురం : నగరంలోని విద్యుత్ ఎస్ఇ కార్యాలయం మీటింగ్ హాలులో సోమవారం ప్రత్యేక విద్యుత్ అవగాహన, అదాలత్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక ఛైర్‌పర్సన్, విశ్రాంత జిల్లా జడ్జి శ్రీనివాసన్ ఆంజనేయమూర్తి బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీరు సంపత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.వి.రమేష్, ఆంధ్ర ప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగులు అన్నిరంగాల్లో రాణించాలి

బ్రహ్మసముద్రం : వికలాంగులు సకలాంగులతో సమానంలో అన్నిరంగాల్లో రాణించాలని తహశీల్దార్ సుమతి పిలుపునిచ్చారు. విభిన్న ప్రతిభ వంతుల దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ప్రభావతమ్మ, మండల అభివృద్ధి అధికారి నందకిశోర్, విద్యాధికారి ఓబుళపతి, ఎస్ఐ నరేంద్ర, బ్రహ్మసముద్రం వెల్ఫర్ అసిస్టెంట్ రవితేజ, అంగన్వాడీ కార్యకర్తలు సత్యవతి, మరియు శ్రీ బాలాజీ వికలాంగుల మండల సమాఖ్య నాయకులు ఆయా గ్రామాల వికలాంగులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని వినతి

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని మామడూరు ప్రాథమిక పాఠశాలలో అదనపు ఉపాధ్యాయులను నియమించాలని మాముదూరు గ్రామస్తులు మల్లికార్జున, చిత్తయ్య, రామచంద్రప్ప, కృష్ణమూర్తి తదితరులు కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు.

నూతన డైరీ ఆవిష్కరణ

అనంతపురం : నూతన సంవత్సరం-2025 డైరీని జిల్లా ప్రిన్సిపల్ జడ్జి శ్రీనివాస్ సోమవారం నగరంలోని కోర్టు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అలాగే న్యాయవాదులకు ఉపయోగంగా బిఎన్ఎస్, బిఎన్ఎస్ఎస్, విఎస్ఎస్ వంటి చట్టాలను తెలియజేస్తూ డైరీని రూపొందించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ బార్ కౌన్సిల్ వైస్ ఛైర్మన్ రామిరెడ్డి, అనంతపురం అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రాజేంద్రప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

అహుడా ఛైర్మన్‌కు సన్మానం

అనంతపురం : అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ టీసీ వరుణ్‌ను సోమవారం నగరంలోని రామ్‌నగర్ కార్యాలయంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రాయల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం, మెమెంటో అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చంద్రబాబు, రమణ, గణేష్, చిన్న రాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ సదస్సులు

పామిడి : మండల పరిధిలోని కండ్లపల్లి, వంకరాజుకాలవ గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

యల్లనూరు : మండల కేంద్రంలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ లైన్‌మెన్ ఓబులేసు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద చెట్ల తొలగింపు, లైన్లకు అడ్డంగా ఉన్న కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

సిఐకు సన్మానం

ఉరవకొండ : ఉరవకొండ అర్బన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన మహానందిని సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎంఆర్‌పిఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ చట్టాలను కఠినంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు రాజు, చెన్నప్ప, వెంకటేశులు, మారెన్న, వీరేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందించే వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. సోమవారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో రాప్తాడు నియోజకవర్గ రైతులకు భారీ సబ్సిడీ మంజూరైన పంట కోత యంత్రాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్కో యంత్రం విలువ రూ.5.70లక్షలు కాగా ప్రభుత్వం రూ.2 లక్షల సబ్సిడీ ఇచ్చిందన్నారు. మిగిలిన రూ.3.70 లక్షలను రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ రవి, ఎఒ శశికళ, ఆత్మకూరు మండల ఇన్‌ఛార్జి ఎఒ సాయిలక్ష్మి, ఎఇఒలు మురళీకృష్ణ, సుజిత, టిడిపి నాయకులు బాలాజీ, గ్రంధి శ్రీనివాసులు, శశాంక్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు యంత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఈక్రాప్ బుకింగ్ తప్పనిసరి

ప్రజాశక్తి-గుత్తి

రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ముస్తాక్‌అహ్మద్ సూచించారు. సోమవారం మండలంలోని వన్నెదొడ్డి గ్రామంలో రైతులు రాముడు నాగార్జున సాగుచేసిన టమోటా, వేరుశనగ పంటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15వతేదీలోపు పంటల బీమా చేసుకోవాలన్నారు. అనంతరం పి.ఎర్రగుడి, బ్రాహ్మణపల్లి, ఈశ్వరపల్లి, పూలకుంట రైతులతో వ్యవసాయ సిబ్బంది చేస్తున్న పంటల బీమా, ఈక్రాప్ బుకింగ్ ప్రక్రియలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఎ మౌనిక, విఎస్ఎ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్‌పై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్‌బాషా పారిశుధ్యం నిర్వహణపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతపై బాధ్యతగా ప్రజలు మెలగాలన్నారు. రహదారుల్లో దుకాణాదారులు చెత్తను వేయరాదన్నారు. పారిశుధ్య కార్మికులు రహదారులను శుభ్రం చేసిన తర్వాత ఎక్కడపడితే అక్కడ చెత్తను వేస్తే జరిమానాలను విధిస్తామని హెచ్చరించారు. ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ కార్యదర్శులు దుర్గాప్రసాద్, రాజేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ఎన్నికలపై సమావేశం

ప్రజాశక్తి-యల్లనూరు

ఈనెల 14న నిర్వహించనున్న సాగునీటి ఎన్నికల నిర్వహణపై సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రాజా మాట్లాడుతూ మండలంలోని వేములపల్లి, తిరుమలాపురం, కల్లూరు, యల్లనూరు గ్రామాల్లో సాగునీటి ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఎలాంటి అవరోధాలు లేకుండా సజావుగా ఎన్నికలు జరిగేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మునీంద్ర, సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరరావు, మండల సర్వేయర్ షర్వాణి, విఆర్ఒలు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

దారి లేకుండా గొయ్యి తీశాడని ఫిర్యాదు

యల్లనూరు : మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో ఓ రైతు పొలాలకు వెళ్లే దారికి అడ్డంగా గొయ్యి తీశాడని పలువురు రైతులు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికలో తహశీల్దార్ రాజాకు ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన తహశీల్దార్ వెంటనే రైతును పిలిపించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ సర్వేయర్ శంకర్, విఆర్ఒను ఆదేశించారు.

అశ్వర్థంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండల పరిధిలోని అశ్వర్థ నారాయణస్వామి సన్నిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి సోమవారం శ్రీకారం చుట్టారు. త్వరలో జరగనున్న అశ్వర్థ నారాయణస్వామి తిరుణాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11, 12న సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, ఎనర్జీ, వెల్ఫేర్ అసిస్టెంట్లు, 16, 17న డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు విఆర్ఒలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఈనెల 11, 12వ తేదీల్లో మండలంలోని సర్పంచులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ అలివేలమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు మండలంలోని సర్పంచులు, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

ఉరవకొండ : ప్రభుత్వ ఆదేశాల మేరకు వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని సర్పంచి మల్లెల జగదీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ పిల్లల ఆధార్ నమోదులో తప్పులను డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ల అవసరాల నిమిత్తం ఆధార్ సెంటర్ ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామంలోని విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేంద్రప్ప, డిజిటల్ అసిస్టెంట్లు జ్యోతి, రామచంద్ర, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీని అభివృద్ధి చేయడమే లక్ష్యం

సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో వక్తలు

ప్రజాశక్తి-కుందుర్పి

మండలంలో కాంగ్రెస్ పార్టీని అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఆ పార్టీ మండల కన్వీనర్ బొజ్జప్ప తెలిపారు. ఎఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ పుట్టినరోజును పురస్కరించుకుని కేక్ కోసం సంబరాలు చేసుకున్నారు. తర్వాత నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మండల అధ్యక్షుడు బొజ్జప్పను నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బొజ్జప్ప మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తనకు అవకాశం ఇచ్చినందుకు జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా మండలంలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గౌని తిప్పేస్వామి, ఎర్ర రామాంజనేయులు, బొట్టు ఆంజనేయులు, కూరాకుల హనుమంతురెడ్డి, గోపాల్, రామప్ప, చిత్తప్ప, హనుమంతురాయుడు, ఎన్.వెంకటంపల్లి తిప్పేస్వామి, కుమార్, హనుమంతరాయుడు, మల్లికార్జున, రామాంజనేయులు, హనుమంతరాయుడు, చిక్కన్న, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కోసం సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాల ఎర్రిస్వామి, డిసిసి సభ్యులు తిమ్మప్ప, ఫక్రుద్దీన్, కరెంటు గోవిందప్ప, జిల్లా ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఈరన్న, ఐదు మండలాల కన్వీనర్లు బొజ్జప్ప, మల్లయ్య, సన్నప్పయ్య, మధుసూదన్, పాతన్న, కళ్యాణదుర్గం మున్సిపాలిటీ కన్వీనర్ నాగరాజు, ఉపాధ్యక్షులు మాల ఈశ్వర్‌ప్రసాద్, చాపిరి బూదెప్ప, సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.




ఉరవకొండలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉరవకొండ : ఏఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉరవకొండలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బ్యాళ్ల ప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కోసం సంబరాలు చేసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులు, విట్టల్ రుక్మిణి ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్బాస్, రమేష్, సుధాకర్, సాహెబ్, హమ్మర్, ఓబులేసు, రాముడు, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తికి సన్మానం

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలోని పాతపేట శివారులో ఉన్న మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన విలేకరి అంజన నారాయణను మండల విద్యాశాఖ అధికారి పరమేశ్వరరెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ 2018-19లో పాఠశాలకు బదిలీపై వచ్చినప్పుడు కేవలం 25 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారన్నారు. అప్పటి నుంచి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గితే పాఠశాలను ఎత్తేసే క్రమంలో విద్యార్థుల సంఖ్య పెంచాలని సంకల్పంతో పత్రిక ప్రచురణలతో రాష్ట్రస్థాయికి చేరుకునేందుకు కృషి చేశారన్నారు. ప్రస్తుతం 90 నుంచి 115 మందికి విద్యార్థుల సంఖ్య చేరుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ చంద్రశేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు మురళి, సునీత, తల్లిదండ్రులు పాల్గొన్నారు



జర్నలిస్టు అంజన నారాయణను సన్మానిస్తున్న ఎంఇఒ పరమేశ్వరరెడ్డి

సభ్యత్వాల నమోదుకు విరాళం

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

టిడిపి సానుభూతిపరులు సభ్యత్వ నమోదు చేయించుకునేందుకు మాజీ కార్పొరేటర్ బల్లా పల్లివి సోమవారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈమేరకు సంబంధిత మొత్తాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి సభ్యత్వ నమోదుకు బల్లా పల్లవి రూ.లక్ష విరాళం అందజేయడం సంతోషకరమన్నారు. మరింత మంది సభ్యత నమోదుకు సాయం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

ఉచిత కారు డ్రైవింగ్ శిక్షణ

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

అనంతపురం రూడ్‌సెట్ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉచితంగా కారు డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 నుంచి జనవరి 17వ తేదీ వరకూ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వయసు 19 నుంచి 45ఏళ్లలోపు ఉండాలన్నారు. శిక్షణలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు అనంతపురంలోని తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అదృశ్యమైన డ్రైవర్ కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి-నార్పల

అదృశ్యమైన మండల కేంద్రానికి చెందిన డ్రైవర్ రాఘవ కుటుంబాన్ని రజక వృత్తిదారుల సమాఖ్య నాయకులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎందుకు కనపించకుండా పోయాడో కుటుంబ సభ్యులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసులు వెంటనే స్పందించి ఆయన ఎక్కడ ఉన్నాడో తెలుసుకుని రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.లింగమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సివి.హరికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు సి.నాగప్ప, జిల్లా జాయింట్ సెక్రటరీ నారాయణప్ప, నార్పల గౌరవాధ్యక్షులు పెద్ద బయన్న, చిన్న బయన్న, పాపన్న, భాస్కర్, శేఖర, పెద్దన్న, అదెప్ప, సిపిఐ నాయకులు గంగాధర్, నాగరాజు, సుధాకర్, పెద్ద పెద్దయ్య, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవన శాఖ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-యాడికి

మండల పరిధిలోని పుప్పాల గ్రామంలో ఉద్యానవన శాఖ అధికారిణి ఉమాదేవి ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అరటి, మామిడి, బత్తాయి, దానిమ్మ, జామ, అల్లనేరేడు, సీతాఫలం, ఇతర పంటల సాగుకు ప్రభుత్వం అందించే పథకాలను వివరించారు. వీటితోపాటు అనేక పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, విఎఎ త్రిపుర పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : కంబదూరు ఎస్సీ కాలనీలో ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా అమలయ్యే వివిధ పథకాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారిణి, ఎస్.గౌసియా, మండల మేనేజర్ హుస్సేన్ పీరా, రైతు సేవాకేంద్రం సిబ్బంది వై.మోహన్, జె.స్నేహా, రైతులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం సరికాదు

అనంతపురం : నకిలీలను ఉపయోగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం సరైంది కాదని జిల్లా రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వైబిపిటిఎ ప్రసాద్ అన్నారు. సోమవారం ఉప్పరపల్లి గ్రామంలో ఉన్న నందిని మినరల్ వాటర్ ప్లాంట్ కేంద్రాలను పరిశీలించారు. ఇందులో భాగంగా ప్లాంట్ లైసెన్స్‌లు, శుభ్రత, ప్యాకింగ్ చేసే విధానం, నీటి నాణ్యతను పరిశీలించి నీటి నమూనాలను హైదరాబాద్ ల్యాబ్‌కు పంపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం, సిఐ జమాల్‌బాషా, ఎఒ వాసుప్రకాష్, డిసిటిఒ విజయలక్ష్మి, ఫుడ్ సేఫ్టీ అధికారి తస్లీం, తూనికల కొలతల ఇన్స్‌పెక్టర్ మహమ్మద్‌గౌస్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు

గుత్తి : మండలంలోని కరిడికొండ గ్రామ సమీపంలో సోమవారం కారు బోల్తా పడిన ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. తెలంగాణలోని కరీంనగర్ చెందిన బాల ప్రకాష్, దివ్య దంపతులు తన కుమారుడు వివాన్‌తో కలిసి బెంగళూరుకు కారులో బయలుదేరారు. కారు మండలంలోని కరిడికొండ గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురి కి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చెట్నేపల్లిలో పట్టపగలే చోరీ

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లిలోని ఓ నివాసంలో సోమవారం పట్టపగలే చోరీ జరిగింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు మస్తాన్ వలి అనే వ్యక్తి కార్పెంటర్ గా పనిచేస్తూ జీవనం కొనసాగించేవాడు. అతనితో పాటు కుటుంబ సభ్యులు పని నిమిత్తం ఇంటికి తాళం వేసుకొని బయటికి వెళ్లిపోయారు. ఇది గమనించిన గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలను తొలగించి లోనికి ప్రవేశించి బీరువాలో ఉన్న 3.5 తులాల బంగారు నెక్లెస్, ఆభరణాలను దోచుకుని వెళ్లారు. మస్తాన్ వలి భోజన సమయంలో ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉండడంతో కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పరిస్థితిని అడిగాడు. చోరీ జరిగినట్లు గ్రహించి పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.

ఆటో బాడుగకు రానన్నందుకు డ్రైవర్‌పై దాడి

తాడిపత్రి రూరల్ : పదిరోజుల కిందట ట్రాక్టర్ టైర్లు తీసుకొచ్చేందుకు ఆటో బాడుగకు రావాలని కోరగా డ్రైవర్ రానున్నందుకు నలుగురు కలిసి సోమవారం హత్యా ప్రయత్నానికి పాల్పడిన ఘటన మండల పరిధిలోని ఇగుడూరు గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు అనిల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు. ఇగూడూరు గ్రామానికి చెందిన నలుగురు పదిరోజుల క్రితం ట్రాక్టర్ టైర్లు తీసుకొచ్చేందుకు బాడుగకు రావాలని కోరగా అనిల్‌కుమార్ రానన్నాడు. ఇది మనసులో పెట్టుకున్న నలుగురు సోమవారం గ్రామంలో ఆటో నిలుపుకుని ఉండగా ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన గాయపడిన అనిల్‌కుమార్‌ను తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దాడి విషయాన్ని బాధితుడు 100కు డయల్ చేసి సమాచారం అందించగా స్పందించిన రూరల్ శివగంగాధర్‌రెడ్డి గ్రామంలోకి వెళ్లి పరిశీలించారు. కాగా అనిల్‌కుమార్‌పై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని ఎపి రైతుసంఘం నాయకులు రాజారామిరెడ్డి డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గార్లదిన్నె : మండల పరిధిలోని కణంపల్లి క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయవాడకు చెందిన మధుకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మధు డ్రోన్ ఆపరేటర్‌గా పని చేస్తుంటాడు. ఈనేపథ్యంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితున్ని స్థానికులు 108లో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు గార్లదిన్నె పోలీసులు తెలిపారు.

మట్కాబీటర్ అరెస్టు

మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో మట్కా నిర్వహిస్తున్న మహమ్మద్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు గార్లదిన్నె పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేయడంతోపాటు రూ.5వేల నగదును స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.